# ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- మంత్రి హరీశ్‌రావు పర్యటన ఏర్పాట్ల పరిశీలన

మక్తల్ టౌన్, అక్టోబర్ 2 : ఈనెల 4న మక్తల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి విచ్చేస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మంత్రి పర్యటన ఏర్పాట్లను ఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పర్యవేక్షించారు. బహిరంగ సభ ప్రదేశం, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం ఉదయం 11 గంటలకు మక్తల్‌లో 150 పడకల దవాఖాన నిర్మాణ పనులకు భూమిపూజతో డెవలప్‌మెంట్ యాక్టివిటీస్‌కు మంత్రి హరీశ్‌రావు శ్రీకారం చుడుతారని తెలిపారు. వారి వెంట డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రాంలాల్, ఎస్సై పర్వతాలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మొగిలప్ప, నాయకుడు అమరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.




సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎస్పీ

# సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి..

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో పలువురు యువకుల చేరిక

ఊట్కూర్, అక్టోబర్ 2 : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను ముచ్చటగా మూడోసారి గెలిపిస్తాయని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లికి చెందిన పలువురు బీజేపీ, ప్రజాపంథ పార్టీలకు చెందిన యువ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై మక్తల్ నియోజకవర్గంలో ఇతర పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకూ భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకూ చేరేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో గోవర్ధన్, శ్రీనివాసులు, రాములు, నక్క రాము, చిన్న నర్సింహులు, వంకాయల రాము ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రమేశ్, సీనియర్ నాయకులు రాజేందర్‌గౌడ్, బాలరాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం

## మంత్రి పర్యటనకు
# పటిష్ట బందోబస్తు

- పేట ఎస్పీ వెంకటేశ్వర్లు

కోస్గి, అక్టోబర్ 2 : మండలకేంద్రంలో పలు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు బుధవారం మంత్రి హరీశ్‌రావు వస్తున్నారు. ఈక్రమంలో ఎస్పీ వెంకటేశ్వర్లు సోమవారం కోస్గి లో మంత్రి పర్యటనకు సంబంధించి ప్రభుత్వ దవాఖాన, హెలిప్యాడ్, సభాస్థలిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మైదానంలో నిర్వహించే పబ్లిక్ మీటింగ్ వద్ద బందోబస్తు, బారికేడ్లతోపాటు ముందస్తు జాగ్రత్తలను పోలీసు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రామకృష్ణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాజేశ్, పీఏసీసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శశిధర్, డీఎస్పీ సత్యనారాయణ, సీఐ జనార్దన్, ఎస్సైలు శ్రీనివాసులు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌కు జై కొట్టిన ద్వారకానగరం

- ఎమ్మెల్యే ఆల సమక్షంలో కారెక్కిన గ్రామస్తులు
- కారు గుర్తుకే ఓటేస్తామని ఏకగ్రీవ తీర్మానం



ఎమ్మెల్యే ఆల సమక్షంలో పార్టీలో చేరి బీఆర్‌ఎస్‌కు జై కొడుతున్న ద్వారకానగరం గ్రామస్తులు

మదనాపురం, అక్టోబర్ 2 : తమ గ్రామ అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీకి జై కొట్టారు మదనాపురం మండలం ద్వారకానగరం గ్రామస్తులు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తమ మద్దతు తెలుపుతూ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో సోమవారం ఊరు ఊరంతా కారెక్కారు. ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు భూత్పూర్‌లో బీఆర్ఎస్‌లో చేర గా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మాట్లాడుతూ ఉమ్మడి పాలనలో రవాణా వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లమని, 2014లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఆలను పార్టీలకు అతీతంగా వెళ్లి తమ గ్రామానికి రోడ్డు వేయించాలని కోరామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం గెలిచిన వెంటనే రూ.45లక్షలతో తమ గ్రామానికి బీటీ రోడ్డు వేయించారని గుర్తు చేశారు. తమ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నందుకు కృతజ్ఞతగా ఎమ్మెల్యే ఆలకే తమ ఓటు వేయాలని తీర్మానం చేసుకున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇతర పార్టీల నాయకులు దయచేసి తమ గ్రామానికి రావొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

**అన్నాసాగర్‌లో 200 మంది చేరిక**

భూత్పూర్, అక్టోబర్ 2 : అన్నాసాగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వెల్కిచర్ల సర్పంచ్ పద్మాజక్కిరెడ్డితో పాటు వందమంది బీఆర్ఎస్‌లో చేరారు. అదేవిధంగా తాటిపర్తికి చెందిన ముఖీద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు చెందిన 60మంది, మద్దిగట్లకు చెందిన 40మంది కారెక్కగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణించాలి

- విద్యతోపాటు క్రీడలకు సర్కారు సముచితస్థానం
- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 2 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సూచించారు. సోమవారం కల్వకుర్తిలోని ఎంజేపీ బాలికల గురుకులంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల(అండర్-14, 19)ను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం గాంధీజీ, జ్యోతిబా పూలే, సావిత్రీబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి జాతీయ, క్రీడ, ఎంజేపీ పాఠశాల పతాకాలను ఆవిష్కరించారు. విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యతో సమానంగా క్రీడలకు సముచితస్థానం కల్పిస్తున్నదని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అతిథులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, ఎంపీపీ మనోహర, కౌన్సిలర్ సైదులు, నాయకులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో
# మెరిసిన లావణ్య

మహ్మదాబాద్, అక్టోబర్ 2 : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ హైజంప్‌లో నంచర్ల గురుకుల (టెన్త్) విద్యార్థిని లావణ్య గోల్డ్ మెడల్ సాధించినట్లు సాంఘిక సంక్షేమ గురుకులం ప్రిన్సిపాల్ వెంకటమ్మ తెలిపారు. కరీంనగర్‌లో జరిగిన హైజంప్ పోటీల్లో లావణ్య ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో నంచర్ల గురుకులం పేరు నిలిపినందుకు ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్‌లో లావణ్య జాతీయ, అంతర్జాతీయస్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు.



గోల్డ్ మెడల్‌తో లావణ్య

# మన జీవితం మన చేతుల్లోనే..

- జిల్లా జడ్జి పాపిరెడ్డి
- జిల్లా జైలులో ఘనంగా ఖైదీల సంక్షేమ దినోత్సవం



పోటీలో గెలుపొందిన ఖైదీలకు బహుమతులు అందజేస్తున్న జడ్జి పాపిరెడ్డి

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, అక్టోబర్ 2 : భగవంతుడు ఇచ్చిన జీవితాన్ని ఎలా వినియోగించుకోవాలనేది మన చేతుల్లోనే ఉంటుందని మహబూబ్‌నగర్ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి పాపిరెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా జిల్లా జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 90 శాతం మంది క్షణికావేశంలో చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తున్న వారేనని తెలిపారు. నేరం చేస్తే ఎలాంటి శిక్ష ఉంటుందనేది జైలులో ఉన్నప్పుడు ఖైదీలకు తెలుస్తుందని, అది గుర్తుంచుకొని భవిష్యత్‌లో నేరాల జోలికి వెళ్లొద్దని, మంచి పౌరులుగా బతకాలని సూచించారు. ఖైదీల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ జైలు జీవితం తర్వాత సొసైటీలో మంచివారుగా తయారు కావాలన్నారు. జిల్లా జైలులోని ఖైదీలు కూరగాయల పెంపకంతో పాటు ఇతర వస్తువులను తయారు చేయడం సంతోషకరమన్నారు. ఎస్పీ నరసింహ మాట్లాడుతూ గాంధీజీని ఆదర్శంగా తీసుకొని మంచి పౌరులుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. జైలు శిక్షణాలయం లాంటిదని, దీనిని సద్వినియోగం చేసుకోని సత్ప్రవర్తన కలిగి ఉండాలని తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తనతో బయటికి వెళ్లాలని సూచించారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్ హెడ్ రఘుపతి, డీఎంహెచ్‌వో కృష్ణ మాట్లాడిన అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు పోటీల్లో గెలుపొందిన ఖైదీలకు అతిథులు బహుమతులు అందజేశారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బిజినపల్లి, అక్టోబర్ 2 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని పాలెం గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్‌కు చెందిన రాంలాల్(42), అతడి భార్య గౌరీదేవితో కలిసి సోమవారం వనపర్తికి బైక్‌పై వెళ్లి తిరుగు పయనమయ్యారు. ఈక్రమంలో పాలెం సమీపంలో సుబ్బయ్యకాలనీ వద్దకు రాగానే కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కిందపడింది. దీంతో రాంలాల్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, అతడి భార్యకు గాయాలయ్యాయి. ఘటనపై గౌరీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై రాములు తెలిపారు.

# చేపల వలలో చిక్కుకొని మత్స్యకారుడు మృతి

వీపనగండ్ల, అక్టోబర్ 2 : చేపల వలలో చిక్కుకొని మత్స్యకారుడు మృతి చెందిన ఘటన వీపనగండ్ల మండలం కల్వరాలలో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కల్వరాలకు చెందిన సగనమోని రాముడు(33) సోమవారం ఆమడబాకుల కుంటలో చేపల వేటకు వెళ్లాడు. ఈక్రమంలో కుంటలో వల వేయగా అది ప్రమాదవశాత్తు అతడి కాళ్లకు చుట్టుకొని నీటిలో మునిగిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి బయటికి తీసే సరికి అతడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిప్రకాశ్ తెలిపారు.

# అంజనగిరి@1 .5టీఎంసీలు

- రిజర్వాయర్‌లోకి చేరిన కృష్ణాజలాలు

కొల్లాపూర్, సెప్టెంబర్ 2 : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ (అంజనగిరి) రిజర్వాయర్‌లోకి సోమవారం వరకు పంపింగ్ కొనసాగింది. గత నెల 27వ తేదీ సాయంత్రం మోటర్‌ను ఆన్ చేయగా సోమవారం మధ్యాహ్నం వరకు నడిపించి ఆపేశారు. కాగా రిజర్వాయర్‌లోకి 1.5 టీఎంసీల నీరు చేరినట్లు సంబంధిత ఇంజినీర్ తెలిపారు. 8.51టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన నార్లాపూర్(అంజనగిరి) రిజర్వాయర్‌లోకి సిస్టర్న్ నుంచి కృష్ణాజలాలు నురగలు కక్కుతూ పరుగులు తీశాయి. అయితే రిజర్వాయర్‌ను సామర్థ్యం మేరకు నింపకుండా బండ్ పటిష్టత కోసం 2 టీఎంసీలతో నింపుతామని ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అధికారి తెలిపారు.



డెలివరీ సిస్టర్న్ నుంచి వస్తున్న నదీజలాలు



అంజనగిరి రిజర్వాయర్‌లోకి పరుగులు పెడుతున్న కృష్ణమ్మ